క్లుప్తంగా

ఘనంగా ఆరాధనా మహోత్సవాలు



గుడివాడ టౌన్: స్థానిక దనియాలపేటలోని శ్రీ ప్రణవాశ్రమంలో ప్రణవానందస్వామి వారి 55వ ఆరాధనా మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రణవాశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్థైర్యానంద సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, పూజాలు చేశారు. అనంతరం స్వామి వారి అన్నప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ ఆర్.వేణుబాబు, భక్తులు సీహెచ్ శ్రీనివాసరావు, వి.సూరిబాబు, ఎ.శివయ్య, ఎస్.శేషగిరిరావు, అర్చకులు కోట శ్రీనివాసశర్మ, భక్తులు పాల్గొన్నారు.

నేలకూలిన చెట్లు



పమిడిముక్కల: మండలంలో బుధవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులకు పమిడిముక్కల, అగినపర్రు, హనుమంతపురం అడ్డరోడ్డు వద్ద చెట్లు నేలకూలాయి. పలుచోట్ల చెట్లు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అర్ధరాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

ముదినేపల్లి రూరల్ : గుడివాడ డిపో నుంచి వయా చిగురుకోట మీదుగా కైకలూరు వెళ్లే బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. గత కొన్నేళ్ల వరకు ఈ రూటులో బస్సు సౌకర్యం ఉండేది. ఈ బస్సు వడాలి, పెదకామనపూడి, చినకామనపూడి, శింగాపురం, చిగురుకోట, తామరకొల్లు గ్రామాల మీదుగా కైకలూరు వెళ్లేది. కొంత కాలం చిగురుకోట వరకు మాత్రమే సర్వీసు నడిపేవారు. ఈ రూటులో బస్సు నడపడటం లాభదాయకం కాదనే ఉద్దేశంతో అధికారులు రద్దు చేశారు. దీంతో ఈ రూటులోని ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు ఆటోలో దిక్కయ్యాయి. దీంతోవారు అధికవ్యయ, ప్రయాసలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారం కాకుండానే సమ్మె విరమణ



పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో గత కొద్ది రోజులుగా చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లు చేస్తున్న సమ్మెను గురువారం విరమించినట్లు ప్రకటించారు. అయితే వీరి డిమాండ్‌లు మాత్రం పరిష్కారం కాలేదు. తాడిగడప మున్సిపాలిటీలో తడిచెత్త పొడి చెత్త తరలించటానికి దాదాపు 40 చెత్త తరలించే వ్యాన్‌లు ఉన్నాయి. అవి కాంట్రాక్టర్ పరిధిలో పని చేస్తాయి. అయితే తాడిగడప మున్సిపాలిటీ సకాలంలో బిల్లులు చెల్లించినా కాంట్రాక్టర్ గత రెండు నెలలుగా డ్రైవర్లకు జీతాలు ఇవ్వలేదని డ్రైవర్లు ఆరోపించారు. దీంతో డ్రైవర్లు గత రెండు వారాలుగా సమ్మె చేస్తున్నారు. మున్సిపాలిటీ కమిషనర్ వెంకటేశ్వరరావు హామీ ఇచ్చినా సమ్మె విరమించలేదు. అయితే తాజాగా గురువారం కమిషనర్ వెంకటేశ్వరరావును వినతిపత్రం డ్రైవర్లు అందజేశారు. కమిషనర్ హామీ ఇచ్చారని సమ్మె విరమించారు. రెండు వారాలుగా డ్రైవర్లు చేసిన సమ్మెకు డిమాండ్లు వాస్తవ రూపంలో పరిష్కారం కాలేదు. రెండు వారాలుగా మున్సిపాలిటీ పరిధిలో జనాలు చెత్త కుప్పలతో ఇబ్బందులు పడ్డారు. కాగా కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, మస్తాన్‌వలి, టీడీపీ నేత అనుమోలు ప్రభాకరరావు తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కళాకృతులు

జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీస్తే అది ఎన్నో ఆవిష్కరణలకు దోహదపడుతుందని గ్రంథాలయాధికారి వి.నాగసురేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు గురువారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నాగసురేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు తయారు చేసిన పేపర్‌క్రాఫ్ట్ కళాకృతులు, వివిధ పద్ధతుల ద్వారా తయారు చేసి ఆర్ట్సను ప్రదర్శించారు. ఆయా కళాకృతులు జీవకళను ఉట్టిపడేలా ఉన్నాయంటూ విద్యార్థులను గ్రంథాలయాధికారితోపాటు పాఠకులు అభినందించారు.



జమీగొల్వేపల్లిలో తాముచేసిన కళాకృతులను చూపుతున్న విద్యార్థులు



ముదినేపల్లి గ్రంథాలయంలో నీతి కథలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

మండవల్లిలో..

మండవల్లి: విద్యార్థులు పుస్తకాలతోపాటు దినపత్రికలు కూడా చదవడం ద్వారా జనరల్ నాలెడ్జ్‌ని పెంచుకోవచ్చని గ్రంథాలయాధికారి షేక్ పర్వీనా సూచించారు. మండవల్లి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులతో దినపత్రికలు చదివించారు. ఈసందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ కరెంట్ అఫైర్స్‌లో పట్టుసాధించాలంటే విద్యార్థులంతా తప్పకుండా దినపత్రికలు చదవాలని సూచించారు.

గుడివాడ పట్టణంలో...

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్‌లోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం అనే అంశంపై విజ్ఞాన సదస్సు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి పి.శాంతి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యురాలు వై.సరోజినిదేవి మాట్లాడుతూ విద్యార్థులకు సమాజ, నైతిక విలువలు, తల్లిదండ్రులు, గురువులతో మసులుకునే విధానంపై అవగాహన కల్పించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్ : ముదినేల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు గురువారం నీతికథలు బోధించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు రమేష్ విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో కథలను బోధించారు.



మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి సరోజినిదేవి



మండవల్లిలో దినపత్రికలు చదువుతున్న విద్యార్థులు

విద్యార్థులచే పుస్తకపఠనం చేయించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి విద్యార్థులకు చెస్, క్యారమ్స్, లూడో వంటి ఆటల పోటీలు నిర్వహించారు.

ఎమ్మెల్యే రామును కలిసిన ప్రభుత్వోద్యోగులు

గుడివాడరూరల్: త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నియోజకవర్గంలోని రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇరిగేషన్,డ్రైనేజీ అధికారులకు సూచించారు. గుడివాడ ఎమ్మెల్యేగా గెలుపొందిన వెనిగండ్ల రామును పలు ప్రభుత్వశాఖల అధికారులు గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పూలబొకెలు అందజేశారు. రామును కలసిన వారిలో ఇరిగేషన్ డీఈ సూర్యభరత్, ఏఈలు, డ్రైనేజీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, మున్సిపల్ అధికారులు కలసి పూలబొకెలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ తనకు రాజకీయ కక్షలు అంటే ఇష్టం లేదని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తానన్నారు.పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలతోపాటు శివారు గ్రామాలకు సాగునీరు అందేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు కె.తులసీ, యలవర్తి శ్రీనివాసరావు, కడియాల గణేష్, వాసే మురళి, దింట్యాల రాంబాబు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు బొకే అందజేస్తున్న ఆయా శాఖల అధికారులు

ఎమ్మెల్యే కుమార్‌రాజాకు ఘనస్వాగతం

పమిడిముక్కల: పామర్రు ఎమ్మెల్యేగా గెలుపొంది తొలిసారి మండలానికి వచ్చిన ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు కపిలేశ్వరపురం, వీరంకిలాకు, పమిడిముక్కలలో టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. కపిలేశ్వరపురంలో ఎన్టీఆర్ విగ్రహాలకు కుమార్‌రాజా పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేకు ఘనంగా సత్కరించారు. తన గెలుపుకు కృషి చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే కుమార్‌రాజా కృతజ్ఞతలు తెలియజేశారు. భారీ బైక్ ర్యాలీతో ఊరేగింపుగా మండలంలో పర్యటించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, నాయకులు లింగమనేని బాబూరావు, మోటూరి వెంకటసుబ్బయ్య, నాదెళ్ల సుబ్రమణ్యం, జక్కా శ్రీనివాసరావు, మైనేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



వీరంకిలాకులో ఎమ్మెల్యే కుమార్‌రాజాను సత్కరిస్తున్న నాయకులు

ముమ్మరంగా ఉపాధి పనులు



అగినపర్రులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



ప్రత్తిపాడులో పంట కాలువ పనుల్లో కూలీలు

పమిడిముక్కల: మండలంలో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలోని ఆయా గ్రామల్లో గురువారం చేపట్టిన 94 పనుల్లో 4150 మంది కూలీలు పాల్గొన్నారు. పంటకాలువలు తవ్వకం, చెరువు పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు ఈసీ కిరణ్‌కుమార్ తెలిపారు.

రూ.1.20లక్షలతో పంటకాలువ పనులు

మండవల్లి: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో రూ.1.20లక్షల ఉపాధి హామీ నిధులతో పంట కాలువ అభివృద్ధి పనులను గురువారం చేపట్టారు. ఈ పనుల్లో 66 మంది కూలీలు పనులు చేశారు. ఎంటీపీ ఎన్.నవీన్ మాట్లాడుతూ పంట కాలువలు, బోదెలు అభివృద్ధితో పొలాలకు సాగునీరు సమృద్ధిగా చేరుతుందని చెప్పారు. రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు కాల్వ అభివృద్ధి దోహదపడుతుందని వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

తోట్లవల్లూరు మండలంలో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలో ఉపాధి హామీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్ కూడా సమీపిస్తుండటంతో పంటబోదెల తవ్వకాలను ఉపాధి కూలీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా 14 గ్రామాల్లో గురువారం 105 గ్రూపులకు చెందిన 1550మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. పనులను ఈసీ విజయభాస్కర్‌రెడ్డి, ఫీల్డు అసిస్టెంట్లు పర్యవేక్షిస్తున్నారు.

ప్రభుత్వ కాలేజీలను ఆదరించాలి

డీఐఈవో సాల్మన్‌రాజు

పామర్రు: అన్నిరకాల వసతులతో ఉత్తమమైన విద్యాబోధన చేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి అందరూ సహకరించాలని డీఐఈవో సాల్మన్‌రాజు కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం పలు హైస్కూల్ హెచ్‌ఎంలతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామర్రు జూనియర్ కళాశాలలో అన్ని సబ్జెక్టులలో అనుభవంగల లెక్చరర్లు ఉన్నారని వివరించారు. కళాశాలలో ఐటీ, ఎస్ఈటీ, ఈఏఎంసీఈటీ వంటి కోర్సులలో ఈ విద్యా సంవత్సరం నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డీఈవో తెహెరా సుల్తానా మాట్లాడుతూ అన్ని వసతులుగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించేలా హైస్కూల్ హెచ్‌ఎంలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాలలో అడ్మిషన్లు పెరిగేందుకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.అరుణప్రభ మాట్లాడుతూ కళాశాలలో గతేడాది మంచి ఉత్తీర్ణతా శాతం సాధించామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్థానిక మలబార్ గోల్డ్‌సంస్థ ద్వారా రూ.10వేల ఆర్థిక పోత్సాహకాన్ని అందిస్తున్నామని వివరించారు. వాసవీ క్లబ్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంలు, పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పదోతరగతి పాసైన తమ విద్యార్థులను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుడివాడ డీవైఈవో ఐ.పద్మరాణి, కృష్ణాజిల్లా ఆర్ఐవో పి.రవికుమార్, వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఐఈవో సాల్మన్ రాజు

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పామర్రు: పదోతరగతిలో ఉత్తమప్రతిభ కనబర్చిన విద్యార్థినీ విద్యార్థులకు ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాలను అందించి వారిని ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ 101వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక అంకమ్మతల్లి దేవస్థానంలో విద్యార్థులకు గురువారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి ఇటువంటి పురస్కారాలను అందిస్తే, వారు మరింత పట్టుదలతో చదివి అత్యుత్తమ మార్కులు సాధిస్తారన్నారు. పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం అధ్యక్షులు కాటూరి వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ ఏఏఎన్‌ఎం హైస్కూల్‌కు చెందిన వి.జోత్స్న, బి.లోకేశ్వరీ, ఆసీస్సీహైస్కూల్‌కు చెందిన సీహెచ్ యువన్, ఉషోదయ హైస్కూల్‌కు చెందిన పఠాన్ గౌసియా, కంకిపాడు జెడ్పీహైస్కూల్‌కు చెందిన అందే వెన్నెల, నిమ్మకూరు జెడ్పీహైస్కూల్‌కు చెందిన మేడిశెట్టి విజయ మౌనిక, విన్నకోటకు చెందిన అస్మాబేగం, గుడివాడకు చెందిన నిజాంపట్నం హేమంత్ వెంకట్, పామర్రుకు చెందిన పెనుమూడి స్నేహిత, జమీదగ్గుమిల్లికి చెందిన మేరుగు వనజ, అడ్డాడకు చెందిన తుమ్మపూడి కీర్తి, గుడివాడకు చెందిన సాయిశ్రీకృష్ణహేమంత్‌లకు ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాలను అందజేసినట్లు వివరించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళా పీఠం గౌరవాధ్యక్షులు కోటి పాండురంగారావు, కోశాధికారి కోడేబోయిన అజయ్, సభ్యులు ఎస్.హేమంత్‌రెడ్డి, వెన్నా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలను అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మురళీకృష్ణ

మెరుగైన సమాజస్థాపనలో భాగస్వాములు కావాలి

పామర్రు: మెరుగైన సమాజస్థాపనలో ప్రతిపౌరుడు భాగస్వాములు కావాలని కృష్ణా జిల్లా పూర్వపు కలెక్టర్ బి.లక్ష్మీకాంతం అన్నారు. వ్యక్తిగత పర్యటనలో భాగంగా గురువారం ఆయన పామర్రు విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలపై ఆయన స్పందిస్తూ గెలుపోటములను గ్రామాల్లోని ప్రజలు, రాజకీయపార్టీ నాయకులు, కార్యకర్తలు హుందాగా తీసుకోవాలని సూచించారు. ఘర్షణలకు, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అందరూ సంయమనం పాటించాలని పిలుపు ఇచ్చారు. తొలుత పామర్రు వచ్చిన సందర్భంగా ఆయనను స్థానికులు దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు.



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ ప్రసాద్

మొవ్వ: పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ శాస్త్రి ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యతలు కూడా తీసుకోవాలన్నారు. భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించేందుకు పర్యావరణ పరిరక్షణ ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి.శ్రావ్యరెడ్డి, హెచ్.మాధవిలత, బి.గౌరమ్మ, ఎస్.నాగేశ్వరరావు, సూర్యకుమారి, లైబ్రేరియన్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్న రైతాంగం



విజయవాడరూరల్: రాష్ట్రంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఖరీఫ్ పంటలు సాగు చేయడానికి సిద్ధమవుతున్నారు. రైతాంగం గ్రామాల్లో ట్రాక్టర్లతో వ్యవసాయ భూములను దుక్కులు దున్నుతున్నారు. కొద్ది రోజుల్లో వరినారు మళ్లు పోయడం తదుపరి నాట్లు వేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు తెలిపారు. విజయవాడ రూరల్ మండలంలో ఈ ఏడాది నాలుగు వేల హెక్టార్లలో ఖరీఫ్ సాగు జరుగుతుందన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వరి విత్తనాలు కలిగి ఉన్న రైతులు బోర్ల కింద ఇప్పటికే నారుమళ్లు పోసుకున్నారని ఏవో తెలిపారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో చండీ హోమం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైశాఖ అమావాస్యను పురస్కరించుకుని భీమనవారిపేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం రుద్రాభిషేకం, చండీహోమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌శర్మ పర్యవేక్షణలో అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు.

ఎన్ఎంఎంఎస్‌కు మొవ్వ విద్యార్థులు ఎంపిక



మొవ్వ: మండలానికి చెందిన పలువురు విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరానికి గాను నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికై తమ సత్తా చాటారు. మొవ్వ గ్రామంలోని శ్రీమండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు చలమలశెట్టి తేజ పవన్‌శ్రీ మోహన్‌సాయి, దర్శి వర్షిని ఎంపికై నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం ఎస్.శ్రీదేవి తెలిపారు. కూచిపూడి సిద్ధేంద్రయోగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శీలం లిల్లిమ్మ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎన్ఎస్ఎస్ కుమార్ వివరించారు. నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు, శిక్షణనిచ్చిన ఉపాధ్యాయులను పాఠశాల హెచ్‌ఎంలతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయ చైర్మన్ పదవులకు రాజీనామా



వడ్డే శాస్త్రులు

గుడివాడరూరల్: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో మండలంలోని మోటూరులో వేంచేసియున్న శ్రీనాగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ వడ్డే శాస్త్రులు తన పదవికి గురువారం రాజీనామా చేశారు. తన రాజీనామాను దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులకు అందజేసినట్లు ఆయన వివరించారు.

రాజీనామా చేసిన బండారు..

గుడివాడటౌన్: స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న శ్రీగౌరీశంకర స్వామివారి దేవస్థానం పాలక మండలి చైర్మన్ డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ తన పదవికి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామాను ఆలయ ఈవో నటరాజన్ షణ్ముగంకు అందజేయగా, రాజీనామాను ఆమోదించినట్లు ఈవో తెలిపారు. బండారు శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పొందిన ఈ పదవిలో ప్రస్తుతం కొనసాగడం ధర్మం కాదని తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



కోనేరుసెంటర్: మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలు గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బస్టాండ్ సెంటర్‌కు సమీపంలోని బెల్ కంపెనీ వెనుక రోడ్డులో గుర్తు తెలియని వృద్ధురాలు మూడు రోజుల క్రితం స్పృహతప్పి పడిపోయింది. స్థానికులు 108కు ఫోన్ చేసి సదరు వృద్ధురాలిని మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటినుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు గురువారం మృతి చెందారు. మృతురాలు ఎర్ర రంగు చీర పచ్చ రంగు జాకెట్ ధరించి ఉన్నారు. ఆమె వయసు సుమారు 60 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి ఆచూకీ తెలియకపోవడంతో గుర్తు తెలియని మహిళ మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిలకలపూడి సీఐ సీహెచ్ సతీష్‌కుమార్ తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే 08672-252233 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం తెలియజేయాలని తెలిపారు.